ANN తెలుగు
మహా పత్రిక
గురువారం, హైదరాబాద్
08-01-2025
పురపోరు 2026
04



**మహా ప్రత్యేకం, నల్లగొండ:**

తెలంగాణ పట్టణ రాజకీయాలు–పాలన చరిత్రలో నల్లగొండ మరో కీలక మలుపు తిరిగింది. మున్సిపాలిటీగా ఉన్న నల్లగొండను మున్సిపల్ కార్పొరేషన్ గా మార్చే బిల్లుకు శాసనసభ, శాసనమండలిలో ఉభయ సభల ఆమోదం లభించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రవేశపెట్టిన తెలంగాణ మున్సిపాలిటీల (మూడో సవరణ) బిల్లు–2026తో నల్లగొండ కార్పొరేషన్ ఆవిర్భవించింది.

## పట్టణ విస్తరణ

**ప్రస్తుత జనాభా: 2,43,615**

**ఓటర్లు: 1,42,620**

**మొత్తం విస్తీర్ణం: సుమారు 107 చ.కి**

**డివిజన్లు - 48**

నల్లగొండ మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మారడం కేవలం పేరు మార్పు కాదు, ఇది పాలనా నిర్మాణంలో, రాజకీయ బలగణనలో, అభివృద్ధి వేగంలో గుణాత్మక మార్పుకు నాంది.

# నల్లగొండ.. నగరమే

## కార్పొరేషన్‌గా అప్ గ్రేడ్

### మంత్రి కోమటిరెడ్డి పట్టుదలకు సీఎం రేవంత్ గ్రీన్ సిగ్నల్

### మున్సిపాలిటీ నుంచి మహానగరానికి.. నల్లగొండ చరిత్రలో కీలక ముందడుగు

నల్లగొండ మున్సిపాలిటీ -

## కాలక్రమం

**1951:** గ్రేడ్–3 మున్సిపాలిటీ

**2013:** గ్రేడ్–1 మున్సిపాలిటీ

**2018 ఫిబ్రవరి 2:** స్పెషల్ గ్రేడ్

**2026 జనవరి 6:** కార్పొరేషన్ (బిల్లుకు ఆమోదం)

## గ్రూప్-1 నుంచి ఐఏఎస్ వరకు

ఇప్పటివరకు నల్లగొండ మున్సిపాలిటీలో గ్రూప్–1 స్థాయి అధికారి కమిషనర్‌గా పనిచేస్తున్నారు. కార్పొరేషన్‌గా మారిన వెంటనే అక్కడ ఐఏఎస్ అధికారి నియామకం జరిగే అవకాశం ఉంటుంది.

## మేలు ఇదే...

- ఫైళ్ల నిర్ణయాలు వేగంగా జరుగుతాయి
- శాఖల మధ్య సమన్వయం మెరుగుపడుతుంది
- రాష్ట్ర స్థాయిలో నేరుగా కమ్యూనికేషన్ ఏర్పడుతుంది
- పెద్ద ప్రాజెక్టులకు తక్షణ ఆమోదాలు సాధ్యమవుతాయి
- ఇది నల్లగొండ అభివృద్ధికి అడ్మినిస్ట్రేటివ్ టర్నింగ్ పాయింట్గా మారనుంది.

## వార్డుల స్థానంలో డివిజన్‌లు

- ప్రస్తుతం నల్లగొండ మున్సిపాలిటీలో 48 వార్డులు ఉన్నాయి.
- కార్పొరేషన్‌గా మారిన తరువాత పెంచుతారా.. యథాతథంగా ఉంచుతారా అన్నది చూడాలి. ప్రస్తుతం మార్పుకు అవకాశం కనబడడం లేదు. విస్తరణ జరిగితే ఎన్నిక వాయిదాపడుతుంది.
- వార్డుల స్థానంలో డివిజన్లు ఏర్పాటు
- జనాభా ప్రాతిపదికన డివిజన్ల సంఖ్య నిర్ణయం
- కౌన్సిలర్ల స్థానంలో కార్పొరేటర్లు
- మున్సిపల్ చైర్మన్ స్థానంలో మేయర్
- ఈ మార్పుతో నల్లగొండలో పట్టణ రాజకీయ సమీకరణలు పూర్తిగా మారే అవకాశం ఉంది.
- డివిజన్ల పునర్విభజన కొత్త నాయకత్వాన్ని ముందుకు తీసుకొచ్చే పరిస్థితి ఏర్పడుతుంది.



## నెరవేరిన మంత్రి కోమటిరెడ్డి లక్ష్యం

నల్లగొండ మున్సిపాలిటీని కార్పొరేషన్ చేయాలన్నది మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి యొక్క దీర్ఘకాలిక రాజకీయ లక్ష్యం. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే ఈ అంశాన్ని పలుమార్లు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ ఆదాయం, జనాభా పెరుగుదల, హైదరాబాద్ సమీపం వంటి అంశాలతో బలమైన వాదనలు వినిపించారు. అధికార యంత్రాంగానికి లేఖలు, ప్రతిపాదనలు పంపించారు. ముఖ్యమంత్రి సానుకూలంగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈ ప్రయత్నాల ఫలితంగానే నల్లగొండకు కార్పొరేషన్ హోదా లభించింది. ఇది కోమటిరెడ్డి రాజకీయ జీవితంలో ఒక మైలురాయి విజయంగా భావిస్తున్నారు.

నల్లగొండ భవిష్యత్తు -

## నగర కల

- కార్పొరేషన్ హోదాతో నల్లగొండ ఇకపై రీజినల్ డెవలప్‌మెంట్ హబ్ గా ఎదుగుతుంది. మున్సిపాలిటీ నుంచి మహానగరానికి...నల్లగొండ అభివృద్ధి పథంలో మరో కీలక అడుగు.
- విద్య, వైద్య, వాణిజ్య కేంద్రం
- పర్యాటక–సాంస్కృతిక నగరం
- అవకాశాల నగరంగా ఎదగనుంది.

పాలన + రాజకీయాలు =

## అభివృద్ధి వేగం

- ఐఏఎస్ అధికారి, మేయర్, కార్పొరేటర్ల వ్యవస్థ అమలులోకి వస్తే అభివృద్ధి పనులు రాజకీయ–అధికార సమన్వయంతో సాగుతాయి. కేంద్ర, రాష్ట్ర నిధులు సులభంగా రాబట్టే అవకాశం ఉంటుంది. స్మార్ట్ సిటీ తరహా ప్రాజెక్టులకు బాటలు పడతాయి. నల్లగొండ ఇకపై కేవలం జిల్లా కేంద్రంగా కాకుండా ప్రాంతీయ అభివృద్ధి హబ్‌గా ఎదిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.



## బీమా అనైతిక విక్రయాలకు చెక్!.. ఐఆర్‌డీఏఐ




బీమా రంగంలో ఉత్పత్తులను తప్పుదోవ పట్టించి విక్రయించడం (అనైతిక మార్గాల్లో) ఆందోళన కలిగిస్తున్నట్టు బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌ఈఏఐ) వార్షిక నివేదిక పేర్కొంది. అసలు దీనికి గల కారణాలను గుర్తించేందుకు బీమా సంస్థలు లోతైన విశ్లేషణ చేయాలని సూచించింది. 2023-24లో జీవిత బీమా కంపెనీలకు వ్యతిరేకంగా 1,20,726 ఫిర్యాదులు రాగా, 2024-25లోనూ ఇదే స్థాయిలో 1,20,429 ఫిర్యాదులు దాఖలైనట్టు తెలిపింది. అనైతిక వ్యాపార విధానాలపై మాత్రం ఫిర్యాదులు 23,335 నుంచి 26,667కు పెరిగినట్టు వెల్లడించింది. మొత్తం ఫిర్యాదుల్లో అనైతిక వ్యాపార పద్ధతులకు సంబంధించినవి 19.33 శాతం నుంచి 22.14 శాతానికి పెరిగినట్టు పేర్కొంది. వ్యక్తుల అవసరాలకు సరిపడని, నియమ, నిబంధనలు, షరతులు గురించి పూర్తిగా తెలియజేయకుండా, కేవలం ప్రయోజనాల గురించే చెబుతూ పాలసీలను విక్రయించడాన్ని మిస్ సెల్లింగ్‌గా చెబుతుంటారు. బ్యాంక్‌లు, బీమా ఏజెంట్ల రూపంలో ఈ తరహా విక్రయాలు సాగుతుంటాయి. ''మిస్ సెల్లింగ్‌ను నిరోధించేందుకు గాను తగిన విధానాలను అమలు చేయాలని బీమా సంస్థలకు సూచించాం. ఉత్పత్తి అనుకూలతను అంచనా వేయడం (పాలసీదారునకు అనుకూలమైనా), పంపిణీ ఛానల్ వ్యాప్తంగా కొన్ని నియంత్రణలు అమలు చేయడం, మిస్ సెల్లింగ్‌పై ఫిర్యాదుల పరిష్కారానికి ప్రణాళిక రూపొందించడం, మూల కారణాలను గుర్తించేందుకు అధ్యయనం చేయాలని సూచించడమైంది''అని ఐఆర్‌డీఏఐ తన 2024-25 నివేదికలో వివరించింది. తప్పుడు మార్గాల్లో బీమా ఉత్పత్తుల విక్రయంపై కేంద్ర ఆర్థిక శాఖ బ్యాంక్‌లు, బీమా సంస్థలను ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉండడం గమనార్హం. అనుకూలం కాని పాలసీలను విక్రయించడం పాలసీదారులు తర్వాత రెన్యువల్ చేసుకోరని, దాంతో పాలసీల రద్దునకు దారితీస్తున్నట్టు పేర్కొంది.

### బీమా విస్తరణ 3.7 శాతం

దేశంలో బీమా విస్తరణ 2024-25 సంవత్సరానికి జీడీపీలో 3.7 శాతంగా ఉన్నట్టు ఐఆర్‌డీఏఐ నివేదిక తెలిపింది. ఇది ప్రపంచ సగటు 7.3 శాతం కంటే సగమే. జీవిత బీమా రంగంలో విస్తరణ రేటు 2023-24లో ఉన్న 2.8 శాతం నుంచి 2024-25లో 2.7 శాతానికి తగ్గినట్టు తెలిపింది. నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ విస్తరణ రేటు మాత్రం యథాతథంగా ఒక శాతం వద్దే ఉంది.

## ఐటీ ఉద్యోగులకు మరో కఠిన నిబంధన!



ఐటీ ఉద్యోగులకు ఉన్న సౌకర్యాలు, వెసులుబాటులూ ఒక్కొక్కటిగా దూరమవుతున్నాయి. ఐటీ కంపెనీలు తమ ఉద్యోగులకు రోజుకో కొత్త కఠిన నియమాన్ని అమలు చేస్తున్నాయి. ఇప్పటికే చాలా కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని పూర్తిగా తొలగించాయి. ఆఫీస్‌కు హాజరును తప్పనిసరి చేశాయి. దేశీ సాఫ్ట్‌వేర్ దిగ్గజం విప్రో.. తన హైబ్రిడ్ పని విధానాలకు మరింత పదును పెట్టింది. కఠినమైన కార్యాలయ హాజరు నిబంధనలను ప్రవేశపెట్టింది. వారానికి మూడు రోజులు ఆఫీస్‌కు వస్తున్న ఉద్యోగులు ఏదో సమయంలో వచ్చి వెళ్లేవారు. కానీ ఇకపై అలా కుదరదు. ఆఫీస్‌కు వచ్చిన ఉద్యోగులు కనీసం ఆరు గంటలు విధుల్లో ఉండాల్సిందే. ఎకనామిక్ టైమ్స్ కథనం నివేదిక ప్రకారం.. జనవరి 1 నుంచి కొత్త రూల్ అమల్లోకి వచ్చింది. ఉద్యోగులు ఆఫీస్‌కు వచ్చినప్పుడు వేసే మొదటి "ఇన్" పంచ్‌కు, వెళ్లేటప్పుడు ఇచ్చే "అవుట్" పంచ్‌కు మధ్య ఈ సమయాన్ని లెక్కిస్తారు. ఈ హాజరు సమయాన్ని సిస్టమ్ నేరుగా లీవ్స్ బ్యాలెన్స్‌తో అనుసంధానిస్తుంది. ఒకవేళ ఎవరైనా ఉద్యోగికి వారంలో అవసమైనంత మేర హాజరు సమయం లేకపోతే వారి లీవ్స్ బ్యాలెన్స్‌లో కోత విధిస్తారు. అయితే ఈ ఆరు గంటల వర్క్ అవర్స్ కార్యాలయంలో గడిపే సమయానికి మాత్రమే వర్తిస్తుందని విప్రో స్పష్టం చేసింది. మొత్తం రోజువారీ 9.5 పని గంటల్లో మాత్రం ఎలాంటి మార్పూ ఉండదు.




## సోలార్ రూఫ్‌టాప్‌లో టాటా పవర్ రికార్డు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ కాలంలో ఒక గిగావాట్ సోలార్ రూఫ్‌టాప్ ఇన్‌స్టలేషన్ల సామర్థ్యాన్ని తన సబ్సిడరీ సంస్థ 'టాటా పవర్ సోలరూఫ్' ద్వారా సాధించినట్టు టాటా పవర్ ప్రకటించింది. ఈ కాలంలో 1.7 లక్షల నివాస, వాణిజ్య, పారిశ్రామిక భవనాలపై ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేసినట్టు (ఇనస్టలేషన్), అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇన్‌స్టలేషన్లతో (38,494) పోల్చి చూస్తే 345 శాతం వృద్ధి సాధించినట్టు తెలిపింది. ఇదే కాలంలో నివాస, వాణిజ్య, పారిశ్రామిక విభాగంలో లక్ష మంది కొత్త కస్టమర్లను చేర్చుకున్నట్టు, దీంతో మొత్తం కస్టమర్ల సంఖ్య 3 లక్షలకు, ఇన్‌స్టాల్డ్ సోలార్ రూఫ్‌టాప్ సామర్థ్యం 4 గిగావాట్లకు పెరిగినట్టు వివరించింది. ఒక్క డిసెంబర్ త్రైమాసికంలోనే 58,476 రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టలేషన్లను సాధించినట్టు తెలిపింది. ఏప్రిల్-డిసెంబర్ కాలంలో అత్యధికంగా యూపీలో 30,857, మహారాష్ట్రలో 21,044 ఇన్‌స్టలేషన్లను చేసినట్టు పేర్కొంది. ఘర్ ఘర్ సోలార్ కార్యక్రమం ద్వారా రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ప్రయోజనాల గురించి వినియోగదారుల్లో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపింది.

## రియల్ ఎస్టేట్‌కి పెట్టుబడులు బూస్ట్



రియల్ ఎస్టేట్ రంగంలో ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు (సంస్థాగత) గతేడాది పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారు. 8.47 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చినట్టు కొలియర్స్ ఇండియా తెలిపింది. 2024లో వచ్చిన 6.56 బిలియన్ డాలర్ల కంటే 29 శాతం అధికమని పేర్కొంది. ఇందులో దేశీ పెట్టుబడులు గణనీయంగా పెరగ్గా, విదేశీ పెట్టుబడులు తగ్గాయి. దేశీ ఇన్వెస్టర్ల నుంచి 4.82 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. 2024లో దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు 2.24 బిలియన్ డాలర్లతో పోల్చి చూస్తే 120 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. విదేశీ పెట్టుబడులు మాత్రం అంతకుముందు ఏడాదితో పోల్చితే 2025లో 16 శాతం తగ్గి 3.65 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ వివరాలతో కొలియర్స్ ఇండియా ఒక నివేదిక విడుదల చేసింది. సంస్థాగత ఇన్వెస్టర్లలో ఫ్యామిలీ ఆఫీసులు, విదేశీ కార్పొరేట్ గ్రూప్‌లు, విదేశీ బ్యాంక్‌లు, ప్రొప్రయిటరీ బుక్‌లు, పెన్షన్ ఫండ్స్, ప్రైవేటు ఈక్విటీ, రియల్ ఎస్టేట్ ఫండ్-డెవలపర్స్, ఎన్‌బీఎఫ్‌సీలు, రీట్‌లు, సావరీన్ వెల్త్ ఫండ్స్ ఉన్నట్టు ఈ నివేదిక తెలిపింది. ''2025లో అధిక శాతం పెట్టుబడులను ఆఫీస్ ఆస్తులు ఆకర్షించాయి. మొత్తం పెట్టుబడుల్లో 54 శాతం (4.53 బిలియన్ డాలర్లు) ఆఫీస్ ఆస్తుల్లోకి వచ్చాయి. ఆ తర్వాత నివాస ప్రాజెక్టులు, పారిశ్రామిక, గోదాముల్లోకి వెళ్లాయి''అని కొలియర్స్ ఇండియా ఎండీ, సీఈవో బాదల్ యాజ్ఞిక్ తెలిపారు. 2026లో సంస్థాగత పెట్టుబడులు మరింత బలపడతాయని, అంతర్జాతీయంగా పెట్టుబడులకు రిస్క్ ధోరణి పెరగడం, దేశీ ఇన్వెస్టర్లు ఇందుకు మద్దతుగా నిలవనున్నట్టు పేర్కొంది.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



## మోదీపై ట్రంప్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు..



**వాషింగ్టన్:** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. అమెరికా భారత సంబంధాలపై మరోసారి స్పందిస్తూ కీలక విషయాన్ని వెల్లడించారు. ప్రధాని మోదీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలను వెల్లడించారు. అమెరికాతో భారత్ వాణిజ్య సమస్యలు, రక్షణ కొనుగోళ్ల విషయమై మోదీ తనను 'సర్' అని పిలిచారని, ఎంతో వినయంగా మాట్లాడారని ట్రంప్ చెప్పుకొచ్చారు. దీంతో, ట్రంప్ వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ..'అమెరికా నుంచి భారత్ అపాచీ హెలికాప్టర్లను ఆర్డర్ చేసింది. కానీ, గత ఐదేళ్లుగా భారత్ వాటిని పొందలేదు. ఈ క్రమంలో ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో భాగంగా.. నాతో మాట్లాడటానికి వచ్చారు. ఆ సమయంలో మోదీ నన్ను సర్ అని సంభోదించారు. సర్, దయచేసి నేను మిమ్మల్ని కలవవచ్చా? అని వినయంగా అడిగారు అని అన్నారు. ఇదే సమయంలో మోదీతో తనకు మంచి సంబంధం ఉందని ట్రంప్ చెప్పుకొచ్చారు. అలాగే, భారత్ 68 అపాచీ హెలికాప్టర్లను ఆర్డర్ చేసింది. హెలికాప్టర్ల కోసం ఎదురుచూస్తోంది. తాను అది చేసి చూపించానని ట్రంప్ పేర్కొన్నారు. స్నేహపూర్వక దేశాలు కీలకమైన రక్షణ పరికరాల కోసం చాలా కాలం నుంచి ఎదురుచూస్తుండగా, కొనుగోలు వ్యవస్థల్లో సంస్కరణలు అవసరమని ట్రంప్ అభిప్రాయపడ్డారు. భారతదేశం వంటి దేశాలు, ఇప్పటికే ఆమోదించిన పరికరాల కోసం డెలివరీలో జాప్యం ఎదుర్కోకూడదని అన్నారు. మరోవైపు.. అపాచీ డెలివరీలలోనే కాకుండా, F35 వంటి అధునాతన ఫైటర్ జెట్‌లలో కూడా ఆలస్యంపై విమర్శించారు. ఇటువంటి సుదీర్ఘ సమయాలు, రక్షణ భాగస్వామ్యాలలో విశ్వాసాన్ని, సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయని ట్రంప్ వాదించారు. ప్రధాని మోడీ వ్యక్తిగతంగా ఈ ఆలస్యాలపై ఆందోళన వ్యక్తం చేశారని, వారి బలమైన వ్యక్తిగత సంబంధం సున్నితమైన విషయాలపై చర్చలు జరిపినట్లు తెలిపారు. ఇదే సమయంలో అమెరికా ఆర్థిక వ్యవస్థపై సుంకాల ప్రభావాన్ని హైలైట్ చేస్తూ ట్రంప్ ఇలా అన్నారు. సుంకాల కారణంగా అమెరికన్లు ధనవంతులు అవుతున్నారు. ఈ విషయాన్ని అందరూ అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను. సుంకాల కారణంగా మన దేశంలోకి 650 బిలియన్ డాలర్లకు పైగా డబ్బు వస్తుంది అంటూ వ్యాఖ్యలు చేశారు.

### నేను సంతోషంగా లేను..

ఇక, అంతకుముందు ప్రధాని మోదీ, భారత్‌పై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుండటంపై తాను సంతోషంగా లేనని, భారత్‌పై అమెరికా అతి త్వరలో సుంకాలను పెంచే అవకాశముందని మోదీకి ఈ విషయం తెలుసు అంటూ ట్రంప్ పేర్కొన్నారు. అలాగే, నన్ను సంతోషపెట్టాలని వాళ్లు (భారత్) అనుకుంటున్నారు. ప్రధాని మోదీ మంచి చాలా మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనన్న విషయం ఆయనకు తెలుసు. నన్ను సంతోషపెట్టడం చాలా ముఖ్యం. వారు రష్యాతో వ్యాపారం కొనసాగిస్తే.. మేం సుంకాలను పెంచుతాం. 50 శాతానికి పైగా సుంకాలు విధిస్తాం. అది వారికి ఏమాత్రం బాగోదు. మా ఆంక్షలు రష్యాను తీవ్రంగా బాధిస్తున్నాయి' అంటూ భారత్ గురించి ప్రస్తావించారు.

## కిమ్ క్షిపణి గర్జనల వేళ..

### డ్రాగన్-కొరియా షాకింగ్ ట్విస్ట్!

**దశాబ్దాల పగను పక్కన పెట్టి.. దక్షిణ కొరియా, చైనాలు ఇప్పుడు స్వప్రయోజనాల కోసం దోస్తీకి సిద్ధమయ్యాయి. తాజాగా చైనాలో అడుగుపెట్టిన దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్, చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో భేటీ కావడం ప్రపంచం దృష్టిని అమితంగా ఆకర్షించింది. 2019 తర్వాత దక్షిణ కొరియా నేత చైనాను సందర్శించడం ఇదే తొలిసారి కావడం ఆసక్తికరంగా మారింది.**



**రెండో ప్రపంచ యుద్ధంలో..**

చైనా, దక్షిణ కొరియాల మధ్య సంబంధం ఈ నాటిది కాదు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్ నుంచి ఎదురవుతున్న దాడులను ఎదుర్కొనేందుకు ఈ రెండు దేశాలు చేతులు కలిపాయి. జపాన్ ఆక్రమణ నుండి కొరియాను రక్షించుకునేందుకు నాడు చైనా అండగా నిలిచింది. ఆనాటి పోరాట వీరుల స్మారకార్థం నేటికీ షాంఘై(చైనా)లో స్మృతి చిహ్నాలు కనిపిస్తాయి. తాజాగా దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ తన పర్యటనలో వాటిని సందర్శించడం ఇరు దేశాల మధ్య ఉన్న చారిత్రక సంబంధానికి నిదర్శనంగా నిలిచింది.

**సయోధ్య కరువయ్యిందిలా..**

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇరు దేశాల పరిస్థితులు తలకిందులయ్యాయి. కొరియా యుద్ధం సమయంలో చైనా.. ఉత్తర కొరియాకు మద్దతు ఇవ్వగా, అమెరికా.. దక్షిణ కొరియాకు అండగా నిలిచింది. దీంతో దశాబ్దాల పాటు ఈ రెండు దేశాల మధ్య సయోధ్య కరువయ్యింది. చైనా కమ్యూనిజం బాటలో, దక్షిణకొరియా ప్రజాస్వామ్య బాటలో ప్రయాణిస్తూ బద్ధశత్రువులుగా మారిపోయాయి.

**వాణిజ్యమే పరమావధిగా..**

'బీబీసీ' అందించిన కథనం ప్రకారం సుమారు 40 ఏళ్ల సుదీర్ఘ మౌనం తర్వాత, 1992లో ఇరు దేశాలు తిరిగి దౌత్య సంబంధాలను పునరుద్ధరించుకున్నాయి. వాణిజ్యమే పరమావధిగా చైనా తన దేశ తలుపులను తెరిచింది. దీంతో దక్షిణ కొరియా కంపెనీలు చైనాలో పెట్టుబడులు పెట్టడం మొదలుపెట్టాయి. నాటి నుండి ఆర్థికంగా ఇరు దేశాలు పరస్పరం ఆధారపడటం మొదలైంది.

**కొరియాపై అనధికారిక యుద్ధం**

2016లో దక్షిణ కొరియా తీసుకున్న ఒక నిర్ణయం చైనాకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ఉత్తర కొరియా ముప్పు నుంచి తప్పించుకునేందుకు అమెరికాకు చెందిన 'థాడ్' (THAAD) క్షిపణి వ్యవస్థను దక్షిణ కొరియా తన గడ్డపై మోహరించింది. ఇది తమ భద్రతకు ముప్పుగా భావించిన చైనా, అప్పటి నుండి కొరియాపై అనధికారిక యుద్ధం కొనసాగిస్తోంది. ఆ క్షిపణి కారణంగా నెలకొన్న వివాదం దరిమిలా చైనాలో కొరియన్ పాప్ (Kpop) సంగీతం, సినిమాలు, నాటకాలపై అప్రకటిత నిషేధం మొదలైంది.

**సెల్ఫీతో చిగురించిన దోస్తీ**

దశాబ్దాల ఉద్రిక్తతల తర్వాత, అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ సోమవారం బీజింగ్‌లో షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. గంభీరంగా సాగిన చర్చల మధ్య, గత ఏడాది జిన్‌పింగ్ తనకు బహుమతిగా ఇచ్చిన షియోమీ ఫోన్‌తో లీ ఆయనతో సెల్ఫీ దిగారు. 'ఫోన్ పిక్చర్ క్వాలిటీ బాగుంది' అంటూ ఆయన చేసిన పోస్ట్, ఇరు దేశాల మధ్య నెలకొన్న వైరం తొలగిపోతున్నదనే సంకేతాన్ని ప్రపంచానికి అందించింది.


**ఉత్తర కొరియాతో పొంచివున్న ముప్పు**

'లీ' చైనా పర్యటనలో ఉన్న సమయంలోనే ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ తన వక్రబుద్ధిని చాటుకున్నారు. ఆదివారం తూర్పు తీరంలో బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అమెరికా తాజాగా వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను పట్టుకోవడాన్ని నిరసిస్తూ కిమ్ ఈ పరీక్షలు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో, ఉత్తర కొరియాను నియంత్రించేందుకు చైనా సహకారం 'లీ'కి అత్యంత కీలకంగా మారింది.

**ఆసియా రాజకీయాల్లో కీలక మలుపు**

'లీ' తాజా పర్యటనలో భాగంగా టెక్నాలజీ, వాణిజ్యం, పర్యావరణ రంగాలలో ఇరు దేశాలు మధ్య కీలక ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యంగా కే పాప్, కొరియన్ డ్రామాలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయడంపై ప్రాథమిక అంగీకారం కుదిరినట్లు సమాచారం. చైనా విదేశాంగ శాఖ కూడా సాంస్కృతిక మార్పిడికి సిద్ధమని ప్రకటించడం కొరియన్ వినోద రంగానికి పెద్ద ఊరటగా నిలిచింది. చైనాతో సంబంధాలను గాడిలో పెట్టిన లీ.. తన తదుపరి పర్యటనలో భాగంగా జపాన్ వెళ్లనున్నారు. అమెరికా, చైనా, జపాన్.. ఈ మూడు దేశాల మధ్య సమతుల్యతను కాపాడుకుంటూ, దక్షిణ కొరియా ప్రయోజనాలను రక్షించడం 'లీ'కి కీలకంగా మారింది. ఏదిఏమైనా 'లీ' పర్యటనతో ఆసియా రాజకీయాల్లో ఒక కొత్త మలుపు మొదలైందని విశ్లేషకులు చెబుతున్నారు.

## ఆ దేశాలతో వాణిజ్యం తెంచుకోండి



వెనిజువెలా వాణిజ్యంపై ట్రంప్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దేశం చైనా, రష్యా, ఇరాన్‌లతో ఆర్థిక సంబంధాలు తెంచుకోవాలని ట్రంప్ ఆదేశాలు జారీచేశారు. అంతేకాకుండా చమురు వెలికితీతలో కేవలం యుఎస్ మాత్రమే భాగస్వామిగా ఉండాలని హెచ్చరించారు. వెనిజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు ఈ ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

వెనిజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోని కొద్ది రోజుల క్రితం ట్రంప్ సర్కార్ బంధించిన సంగతి తెలిసిందే. అయితే అదేశం నుంచి డ్రగ్స్ అధికమెత్తంలో అమెరికాకు వస్తున్నాయని అందుకే శాంతి భద్రతల కోసం ఆయనని బంధించామని ట్రంప్ చెబుతున్నా.. అక్కడి చమురునిల్వలను స్వాధీనం చేసుకోవాడానికే ట్రంప్ ఈ ప్లాన్ వేశారని చాలా మంది భావించారు. తాజాగా ట్రంప్ తీసుకుంటున్న చర్యలతో ఇది నిజం అనే భావన కలుగుతుంది.

ప్రస్తుతం వెనిజువెలాకు తాత్కాలిక అధ్యక్షురాలుగా డెల్సీ రోడ్రిగ్జ్ బాధ్యతలు స్వీకరించారు. తాజాగా ఆప్రభుత్వానికి ట్రంప్ ఆల్టిమేటం జారీచేశారు. "మెట్టమొదటగా వెనిజువెలా చైనా, రష్యా, ఇరాన్,క్యూబాలతో ఉన్న వాణిజ్య సంబంధాలన్ని తెంచుకోవాలి. అమెరికాను తన ఆయిల్ ప్రొడక్షన్‌లో భాగస్వామిగా అంగీకరించాలి. అధిక మెత్తంలో చమురు అమెరికాకు అమ్మేప్పుడు సానుకూలంగా వ్యవహరించాలి" అని తెలిపారు.

అంతేకాకుండా ప్రస్తుతం అమెరికాకు విక్రయిస్తున్న 30మిలియన్ల బ్యారెళ్ల చమురును 50 మిలియన్ బ్యారెళ్లకు పెంచి మార్కెట్ ధరలకు అమెరికాకు విక్రయించాలని తెలిపారు. ఆ డబ్బులను వెనిజువెలా ప్రజల సంరక్షణ కోసం అమెరికా వినియోగిస్తుందన్నారు. అమెరికా వర్గాల నివేదిక ప్రకారం కారకస్ తన దగ్గర ఉన్న చమురునిల్వలను అమ్మకపోతే కేవలం వారాల వ్యవధిలోనే ఆర్థికంగా దివాళా తీసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆ దేశం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

## ఉస్మాన్ హాదీ హత్య..

### ఛార్జ్ షీట్‌లో సంచలన విషయాలు..!

బంగ్లాదేశ్ ప్రస్తుతం హింస కొనసాగుతూనే ఉంది. ఇటీవల అక్కడ రాడికల్ నేత ఉస్మాన్ హాదీ మరణంతో అక్కడ అక్కడి మతతత్వ శక్తులు ఆదేశంలోని హిందువులే టార్గెట్‌గా దాడులు చేస్తున్నాయి. ఇటీవలే కొందరు దుండగులు హిందువులపై దాడి చేసి హతమార్చారు. గత కొద్ది రోజులుగా బంగ్లాదేశ్‌లోని హిందువులపై దారుణాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యపై బంగ్లాదేశ్ పోలీసులు ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. ఈ హత్యను రాజకీయ ప్రతీకార చర్యగా బంగ్లాదేశ్ పోలీసులు అభివర్ణించారు. అవామీ లీగ్, ఛత్రా లీగ్‌తో సంబంధం ఉన్న దాదాపు 17 మందిపై చార్జిషీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. కాగా.. ఈ కేసులో ఇప్పటివరకు 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. హాది బహిరంగ వ్యాఖ్యలు అవామీ లీగ్, ఛత్రా లీగ్ దాని అనుబంధ సమూహాల నాయకులు, కార్యకర్తలను ఆగ్రహానికి గురి చేశాయని ఢాకా అదనపు పోలీస్ కమిషనర్ మొహమ్మద్ షఫీకుల్ ఇస్లాం అన్నారు. కాల్పులు జరిపిన వ్యక్తి ఫైసల్ కరీం మసూద్‌కు ఛత్రా లీగ్‌తో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయని తెలిపారు. మరో నిందితుడు తైజుల్ ఇస్లాం చౌదరి బప్పీ పల్లబి థానా ఛత్రా లీగ్ అధ్యక్షుడు, అవామీ లీగ్ నామినేట్ చేసిన వార్డు కౌన్సిలర్ అని వెల్లడించారు. హత్య తర్వాత మసూద్,మరో కీలక నిందితుడు అలంగీర్ షేక్ పారిపోవడానికి అతను సహాయం చేశాడని ఆరోపణలు ఉన్నాయన్నారు. రాజకీయ ప్రతీకారం కారణంగానే హాది హత్యకు గురయ్యాడని దర్యాప్తులో తేలిందని ఏసీపీ ఇస్లాం అన్నారు. కాగా.. ఛత్రా లీగ్ అనేది బహిష్కరించబడిన ప్రధాన మంత్రి షేక్ హసీనా అవామీ లీగ్ పార్టీ విద్యార్థి విభాగం. తాజాగా ఈ విభాగానికి చెందిన 17 మంది నిందితులపై చార్జిషీట్ దాఖలు చేశారు. మరోవైపు హాదీ హత్య తర్వాత న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ హాది పార్టీ, ఇంక్విలాబ్ మంచా ఢాకాలో ర్యాలీ నిర్వహించింది. బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న భారతీయులందరికీ పని కల్పించడాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసింది. మరోవైపు హాదీ హత్య నిందితులు భారతదేశంలో ఆశ్రయం పొందారని ఆరోపిస్తున్నారు. వారిని అప్పగించడానికి నిరాకరిస్తే ఢాకా అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఇంక్విలాబ్ మంచా హెచ్చరించింది. అయితే హాది హంతకులు భారతదేశంలోకి ప్రవేశించారనే వాదనలను భారత అధికారులు తోసిపుచ్చారు. వారు తమ సరిహద్దు దాటినట్లు ఎటువంటి ఆధారాలు లేవని అన్నారు.

